క్లుప్తంగా

కార్తీక మాసోత్సవాలకు సన్నద్ధం



రాట ఉత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, శ్రీనివాస్, ఆలయ సభ్యులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని ఉమా నీలకంఠేశ్వరాలయం కార్తీక మాసోత్సవాలకు సిద్ధమవుతోంది. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలకు బుధవారం కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పందిరి రాట వేశారు. ఈ నెల 13 నుంచి కార్తీక మాసం ప్రారంభమవుతున్న సందర్భంగా ప్రతి రోజు ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ ఈవో తెలిపారు. ఈ నెల 26న జ్వాలాతోరణం, డిసెంబరు 7న మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు బాదంపూడి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

మద్రిపాలెం: దీపావళి పండగ నేపథ్యంలో పోలీసుల అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదైంది. వివరాలిలా.. కంచరపాలెం ఆర్పీ పేటకు చెందిన కుప్ప వాసు అనే వ్యక్తి అనుమతులు లేకుండా తక్కువ ధరకే మందుగుండు సామగ్రి కొని, వాటిని సమీప ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయించాలని చూశాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఎస్ఐ దివ్య భారతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం



కొత్త సభ్యులను సత్కరిస్తున్న ఫ్రెడ్డీ

కంచరపాలెం: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మయన్మార్ ఆంధ్ర రీప్యాటియేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రిటైర్డ్ ఉద్యోగుల అధ్యక్షుడు ఎ.ఎం.ఫ్రెడ్డీ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. కొత్త సభ్యుల నమోదు, డిసెంబర్‌లో వన భోజనాలు, జనవరి 2న సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు ఎజెండాలో తీర్మానించారు. కొత్తగా అసోసియేషన్‌లో చేరిన సభ్యులను మెమోంటాలతో సత్కరించారు. అనంతరం విందు, వినోదాలతో సరగా గడిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎంఎస్ఆర్ గుప్తా, కోశాధికారి డి.వెంకటేశ్వర రావు, సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం



మహిళను పరీక్షిస్తున్న డాక్టర్ రహమతుల్లా

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు గాంధీనగర్‌లోని రహమతుల్లా హాస్పిటల్ వద్ద బుధవారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. డాక్టర్ బి.శ్రీకాంత్ పలువురు మహిళలకు పాప్ స్మియర్ సర్వైకల్ క్యాన్సర్ టెస్ట్‌తో పాటు సుగర్, బీపీ, ఈసీజీ, 2-డీ ఎకో కార్డియాలజీ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.రహమతుల్లా మాట్లాడుతూ వివిధ రకాల క్యాన్సర్లపై మహిళలకు అవగాహన అవసరమన్నారు. ప్రతి ఒక్కరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలు అందించామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు గంగరాజు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు గెడ్డకు మోక్షం

- సుదీర్ఘ కాల సమస్యకు పరిష్కారం
- జాకీర్‌హుస్సేన్ నగర్ వాసుల హర్షం



జాకీర్‌హుస్సేన్ నగర్ వద్ద రిటైనింగ్ వాల్ నిర్మించి, కాంక్రీట్ బాటం వేసిన గెడ్డ

మద్రిపాలెం: సుదీర్ఘ కాలం నుంచి ఉన్న గెడ్డ సమస్య ఎట్టకేలకు తీరిందంటూ 53వ వార్డు మద్రిపాలెం డాక్టర్ జాకీర్‌హుస్సేన్ నగర్ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని గెడ్డ స్థానికులకు పెద్ద సమస్యగా ఉండేది. 30 ఏళ్లుగా ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా.. ఎవరూ వారి సమస్యను వినలేదు, తీర్చలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో చెప్పినట్టు అన్ని ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ప్రతి సమస్యను తీర్చాలనే ఆయన సంకల్పాన్ని నెరవేర్చేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు నడుం బిగించారు. గెడ్డకు మరమ్మతులు చేయడంతో నివాసుల్లో సంతోషం నెలకొంది.

ఈ గెడ్డ మాధవధార ప్రాంతం నుంచి వచ్చి, జాతీయ రహదారి కింద నుంచి మద్రిపాలెం జాకీర్ హుస్సేన్ నగర్ నుంచి జనావాసాల మధ్యలో నుంచి మద్రిపాలెం మెయిన్ రోడ్డుకు కనెక్ట్ అయి ఉంది. గతంలో ఈ గెడ్డకు బాటమ్ కాంక్రీట్, రక్షణ గోడ ఉండేవి కాదు. చెత్తలు అందులోనే వేసేసేవారు. దీంతో నీరు నిలిచిపోయేది. వర్షాకాలం వచ్చిందంటే చాలు.. మొత్తం చెత్త వచ్చి ఇక్కడ పేరుకుపోయేది. దీంతో స్థానికుల ఇక్కట్లు అన్నీ.. ఇన్నీ కావు. దోమల బెడద ఎక్కువగా ఉండేది. తరచూ అక్కడి ప్రజలు విషజ్వరాల బారిన పడేవారు. ఈ సమస్యపై గతంలో ఎవరికి చెప్పినా చేస్తాం.. చూస్తాం అనే వారే తప్ప, పట్టించుకునే నాథుడే ఉండేవాడు కాదు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని వాటిని నూటికి నూరు శాతం పరిష్కరిస్తోంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా అనేక సమస్యలకు సంబంధించి ప్రజల వద్ద నుంచి నేరుగా వినతులు తీసుకున్నారు. అందులో ఒక్కో సమస్యను పరిష్కరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజుకు జాకీర్‌హుస్సేన్ నగర్ వాసులు గెడ్డ సమస్యను వివరించారు. వెంటనే ఆయన స్పందించి తగు చర్యలు తీసుకుని గెడ్డకు మోక్షం కల్పించారు.

రూ.16 లక్షలతో మరమ్మతులు

ఈ గెడ్డ మరమ్మతులకు సంబంధించి జీవీఎంసీ రూ.16 లక్షల వ్యయంతో పనులు పూర్తి చేసింది. ఇప్పుడు ఇంకొంచెం మేరకు బాటం కాంక్రీట్ వేయాల్సిన అవసరం ఉందని కొందరు కాలనీవాసులు చెబుతున్నారు. కొంచెం లోపలకి వెళ్లే కొలదీ గెడ్డ వద్ద చెత్త పేరుపోయిందని, దాని గెడ్డ పక్క నుంచి ఒక చిన్న రోడ్డు వేస్తే అది డైరెక్ట్‌గా హైవేకు కనెక్ట్ అవుతుందని కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సమస్యలకు పరిష్కారం



గతంలో ఎన్నో ప్రభుత్వాలకు వినతులు ఇచ్చాం. చూసి వెళ్లారే తప్ప.. గెడ్డ సమస్యకు పరిష్కారం చూపలేదు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా కె.కె.రాజుకు వినతిపత్రాలు అందించాం. వెంటనే చర్యలు చేపట్టి గెడ్డకు మరమ్మతులు చేశారు. గెడ్డ పక్క నుంచి రోడ్డు వేస్తే బాగుంటుంది.

– షేక్ నూరి, జాకీర్‌హుస్సేన్ నగర్, 53వ వార్డు

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు..'



పథకాల బ్రోచర్ అందిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్



క్యాన్సర్ పేషెంట్ లక్ష్మి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న కె.కె.రాజు

మద్రిపాలెం: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నామని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం జీవీఎంసీ 50వ వార్డు వుడా కాలనీ 294 సచివాలయం పరిధి మాధవధార, మాన్యం వీధి ప్రాంతాల్లో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి ఆయన పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి బ్రోచర్లు అందజేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజాసంకల్ప యాత్రలో చెప్పినట్టుగానే అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ప్రజలకు నేరుగా ఇంటి వద్దే లబ్ధి పొందేలా ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ ఎం.లక్ష్మి, మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టార్, పార్టీ వార్డు అధ్యక్షురాలు పప్పల సునీత, డైరెక్టర్లు పైడి శ్రీను, జేసీఎస్ మండల కన్వీనర్లు అమర్‌రెడ్డి, 50వ వార్డు నాయకులు ఏవీఎస్ రాజు, పొన్నాడ అప్పారావు మాస్టారు, నారాయణస్వామి, రాజేశ్వరరావు, పైడి ప్రతాప్, అంబటి శైలేష్, సీనియర్ నాయకులు, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగికి కె.కె.రాజు ఆర్థిక సాయం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మాధవధారలో పర్యటిస్తున్న కె.కె.రాజు వద్దకు క్యాన్సర్ వ్యాధితో రెండేళ్లుగా బాధపడుతున్న మాన్యం వీధికి చెందిన జి.లక్ష్మి అనే మహిళను కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని కె.కె.రాజు తెలుసుకుని తక్షణమే రూ.5 వేల ఆర్థిక సాయం అందజేసి మంచి మనసు చాటుకున్నారు.

స్థలంలోకి అక్రమ చొరబాటుపై ఫిర్యాదు

మద్రిపాలెం: తాను కొనుక్కున్న స్థలంలోకి కొందరు ప్రవేశించి, అక్కడ పెట్టిన బోర్డును కూడా తీసేశారని ఓ వ్యక్తి కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు తెలిపిన వివరాలిలా.. మురళీనగర్ శ్రీనివాసనగర్ లేఅవుట్‌లో మద్రిపాలేనికి చెందిన వేగి సురేష్ బ్యాంకు వేలం పాట ద్వారా ఓ స్థలం కొని అక్కడ బోర్డు పెట్టుకున్నారు. అదే ప్రాంతానికి రామ్మోహన్ అనే వ్యక్తి మరి కొందరితో కలిసి ఆ స్థలంలోకి ప్రవేశించారు. దీంతో కొనుగోలుదారుడు పోలీసులను ఆశ్రయించాడు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఎస్ఐ దివ్యభారతి కేసు దర్యాప్తు చేపట్టారు.

గంజాయి విక్రయదారులకు రిమాండ్

సీతమ్మధార: గంజాయి తరలిస్తున్న ఐదుగురిని ఫోర్త్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మహారాణిపేటకు చెందిన క్రాంతికుమార్ వద్ద నలుగురు గంజాయి కొనుగోలు చేసి పోలీసులకు చిక్కారు. విక్రయించే వ్యక్తి క్రాంతికుమార్, ప్రసింజిత్ గొస్, ఆఫీస్ ఖాన్, బొద్దుల రాము, ప్రేమ్‌కుమార్‌లను అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.

మహిళా వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం బుధవారం మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభా వేదికపై నిర్వహించారు. ఈ సందర్భంగా 2024 సంవత్సరానికి సంబంధించి కొత్త కమిటీ ఏర్పాటు, ఇంతవరకు చేసిన సేవా కార్యక్రమాలు, నిర్వహించాల్సిన పిక్నిక్ తదితర విషయాలపై చర్చించినట్లు క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషమణి తెలిపారు. కంచరపాలెం ఆదిలక్ష్మి జ్యుయలర్స్ సిబ్బంది తంబోలా కార్యక్రమం నిర్వహించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాకర్స్ పార్కులో ప్రముఖుల చిత్రాలు



మురళీనగర్ వాకర్స్ పార్కులో ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర ప్రముఖుల కుడ్య చిత్రాలు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ప్రముఖుల కుడ్య చిత్రాలను ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్య సమరంలో పాల్గొనడంతోపాటు తెలుగు భాష ప్రాముఖ్యాన్ని నలుదిశలా వ్యాప్తి చేసి సామాజిక సంస్కరణలకు కృషి చేసిన మహనీయులు తైలవర్ణ చిత్రాలను పార్కు సభావేదిక గోడపై ప్రదర్శించారు. తెల్లదొరల గుండెల్లో నిదురించిన స్వాతంత్ర్య సమర యోధుడు అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు, దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అంటూ ప్రజల్లో చైతన్య దీప్తులు నింపిన గురజాడ అప్పారావు, పదండి ముందుకు.. పదండి ముందుకు .. వస్తున్నాయ్... వస్తున్నాయ్..జగన్నాథ రథ చక్రాలు అంటూ ప్రజల్లో విప్లవ భావాలు రగిల్చి సర్వ సౌభ్రాతృత్వం, సామాజిక సమానత్వానికి కృషి చేసిన మన ప్రాంత కవి శ్రీశ్రీ(శ్రీరంగం శ్రీనివాసరావు), విశాఖ ఉక్కు .. ఆంధ్రుల హక్కు అంటూ నినదించి ఉక్కు ఫ్యాక్టరీని విశాఖకు సాధించిన మహనీయుడు, జై ఆంధ్ర ఉద్యమాల్లో కీలక భూమిక వహించిన నాయకుడు తెన్నేటి విశ్వనాథం, తెలుగు భాషోద్యమం ద్వారా వాడుక భాష ప్రాధాన్యాన్ని తెలిపిన గిడుగు రామ్మూర్తి పంతులు స్మృత్యంజలిగా వారి తైలవర్ణ చిత్రాలను ఏర్పాటు చేశారు. ఇందుకు అవసరమైన ఆర్థిక సాయం వాకర్స్ డిస్ట్రిక్ట్-101 ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్ సమకూర్చారు. సందర్శకులను ఇవి ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. నేటి తరంలో ఉత్తరాంధ్ర ప్రముఖుల వీర గాథలతో స్ఫూర్తిని నింపేందుకు ఈ చిత్రాలను ఏర్పాటు చేసినట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు.

నైపుణ్యంతోనే విద్యార్థుల ఉన్నతి



నిర్వాహకులతో ఏవీఎన్ కళాశాల విద్యార్థులు, యాజమాన్యం

దాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ ఓషన్ సిటీ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అండ్ మెంటరింగ్‌పై సదస్సు నిర్వహించారు. సైకాలజిస్ట్ పి.రవికాంత్ విద్యార్థుల భవిష్యత్‌కు మెంటరింగ్ ఆవశ్యకత, స్టార్టప్ కంపెనీలు ప్రారంభించడానికి కావల్సిన నైపుణ్యాలు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు మాట్లాడుతూ జీవన నైపుణ్యాలు విద్యార్థుల ఉన్నతికి ఏ విధంగా దోహదపడతాయో తెలిపారు. క్లబ్ సిటీ అధ్యక్షురాలు రాజకుమారి, కార్యదర్శి భరాతి రోష్రా, కోశాధికారి సాయిలక్ష్మి, సభ్యులు స్వర్ణలత, భవ్య, ఫిజిక్స్ విభాగాధిపతి డి.సంతోష్‌కుమార్, ఎన్.అనంతలక్ష్మి, ప్రదీప్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

'గెట్ ఆన్ డయల్' యాప్ ఆవిష్కరణ



యాప్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

తాటిచెట్లపాలెం: నగరవాసులకు అవసరమైన సేవలన్నీ ఒకే చోట అందిస్తూ రూపొందించిన యాప్ 'గెట్ ఆన్ డయల్' అని వైశ్యరాజు జ్యుయలర్స్ అధినేత భద్రగిరి రాజు తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం ముఖ్య అతిథిగా ఆయన యాప్‌ను ఆవిష్కరించారు. యాప్ సృష్టికర్త, సైరస్ అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో షణ్ముఖ పవన్‌కుమార్ మాట్లాడుతూ దాదాపు 10 ఏళ్ల పాటు వివిధ విషయాలను అధ్యయనం చేసి ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి యాప్‌ను మొబైల్స్‌లోకి డౌన్‌లోడ్ చేసుకుని తమ ప్రయత్నానికి సహకరించాలని కోరారు. మరో అతిథి రాజశేఖర్(టైమ్ ఇన్‌స్టిట్యూట్) మాట్లాడుతూ వైద్య సేవలు, ఆటో మొబైల్ సేవలు, ఫుడ్ ఆన్‌లైన్, గ్రోసరీ తదితర వివరాలు ఈ యాప్‌లో లభిస్తాయన్నారు. కార్యక్రమంలో రవి(జే స్టూడియో), గవర సత్తిబాబు, గవర రమణ సత్తిబాబు, గెట్ ఆన్ డయల్ సిబ్బంది కె.శ్యామల, వై.సంగీత, ఆర్.శ్యామల, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి పుస్తక మహోత్సవం

అల్లిపురం : విశాలాంధ్ర బుక్ హౌస్ విశాఖపట్నం శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి నిర్వహించనున్న విశాలాంధ్ర విశాఖ 22వ పుస్తక ప్రదర్శన ప్రచార పోస్టర్‌ను నగర శాంతి భద్రతల డీసీపీ-1 కె. శ్రీనివాసరావు ఆవిష్కరించారు. బుధవారం సాయంత్రం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రతినిధులు పీపీ రాజు, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, సభ్యులు సీఎస్ క్షేత్రపాల్‌రెడ్డి, శ్యాంసుందర్ తదితరులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాలాంధ్ర ప్రచురణ సంస్థలు తెలుగు సాహిత్య విస్తరణకు విశేష కృషి చేస్తున్నాయన్నారు. పుస్తక మహోత్సవాన్ని పుస్తకప్రియులు, సాహితీవేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అడ్డదిడ్డంగా పార్కింగ్



సీతమ్మధార కేఎస్ఆర్ కాంప్లెక్స్ వద్ద పార్క్‌చేసిన వాహనాలు

సీతమ్మధార: సీతమ్మధార ప్రధాన రహదారిలోని కేఎస్ఆర్ కాంప్లెక్స్ వద్ద అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. బుధవారం ఇక్కడి షాపుల వద్ద వచ్చిన వాహన చోదకులు కార్లను రోడ్డుకు అడ్డంగా పార్క్‌చేయడంతో రాకపోకలకు కష్టతరంగా మారింది. తహసీల్దార్ కార్యాలయం జంక్షన్ నుంచి ఎస్ఎఫ్ఎస్ స్కూల్ రోడ్డు వరకు ఆటోలు, కార్లు, టూ వీలర్లను రోడ్డుపై ఇబ్బందికరంగా పార్క్ చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రూ.64.7 లక్షలతో అభివృద్ధి పనులు



శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు, కటుమూరి సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం ధర్మానగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద పలు అభివృద్ధి పనులకు బుధవారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, డిప్యూటీ మేయర్, పార్టీ మండల అధ్యక్షుడు కటుమూరి సతీష్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.64.70 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, సామాజిక భవనాల నిర్మాణానికి భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ప్రారంభించారు. ముందుగా వారు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల వినతి మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కె.కె.రాజు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శశికళ, డీఈఈ భరణికుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, వార్డు అధ్యక్షులు కాయిత పైడి రత్నాకర్, డి.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు సిద్ధార్థరాజు, వై.ఎస్.రావు, వై.వి.రాజు, బద్రి, సురేష్, కె.చిన్నా, అప్పారావు, కనకరాజు, లక్ష్మి, కరుణ, నాగలక్ష్మి, పద్మప్రియ, దాసు, అనురాధ, ప్రగతి మండలి సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



మృతురాలి కుటుంబ సభ్యులకు బీమా సొమ్ము అందిస్తున్న కార్పొరేటర్ సారిపల్లి గోవింద్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 25వ వార్డులో ఇటీవల మరణించిన ఇద్దరు వ్యక్తులకు చెందిన రెండు కుటుంబాలకు బుధవారం కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ చేతుల మీదుగా వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయంగా రూ.10 వేల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ వార్డు పరిధిలో సహజ మరణం పొందిన పప్పురూ, బొడ్డది బంగారమ్మ కుటుంబ సభ్యులకు తక్షణ సహాయంగా రూ.20 వేలను అందజేసినట్లు తెలిపారు. మిగిలిన వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతుందన్నారు. కార్యక్రమంలో 133 సచివాలయ కన్వీనర్ బొమ్మాళి రవి, యూత్ ప్రెసిడెంట్ సన్ని, సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ లక్ష్మీకుమారి, వలంటీర్లు సంధ్య, లక్ష్మి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆధార్‌తో బ్యాంకు ఖాతా తెరచి మోసం

మద్రిపాలెం: గతంలో ఓ ఇంట్లో అద్దెకు ఉండి.. యజమాని ఆధార్ కార్డు తీసుకుని వేరే చోట బ్యాంకు ఖాతా తెరచి ఇంటి యజమానిని ఓ వ్యక్తి మోసం చేసిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలిలా.. కంచరపాలెం ఇందిరానగర్‌లో సత్తి పద్మావతి అనే మహిళ ఇంట్లో గొంప నాయుడు అనే వ్యక్తి చాలా కాలంగా అద్దెకు ఉన్నాడు. 2020లో ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయాడు. ఆ సమయంలో గ్యాస్ కనెక్షన్ కోసం సదరు యజమానిని ఆధార్ కార్డు అడిగాడు. ఆమె ఇవ్వడంతో ఆ వ్యక్తి గాజువాకలోని ఓ బ్యాంకులో ఆధార్ కార్డుతో వేరే అకౌంట్‌ను తెరచి, లావాదేవీలు కొనసాగిస్తున్నాడు. అనుమానం వచ్చిన ఆమె తనకు ప్రభుత్వం ఇచ్చే పథకాల సొమ్ము తన అకౌంటుకు రావడం లేదని సచివాలయంలో ఆరా తీయగా.. ఆమెకు గాజువాకలోని ఓ బ్యాంకులో ఉన్న ఖాతాలో నగదు జమవుతుందని వారు చెప్పడంతో ఆమె నివ్వెరపోయింది. దీంతో కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.సాయి కేసు దర్యాప్తు చేపట్టారు.

తెలుగు భాషకు 'గిడుగు' సేవలు అపూర్వం



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

తాటిచెట్లపాలెం: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో తెలుగు భాషకు గొడుగు – గిడుగు అనే అంశంపై ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.వేణు ప్రసంగిస్తూ తెలుగు భాషకు.. ముఖ్యంగా వ్యవహారిక భాష ఉనికికి, వ్యాప్తికి కృషి చేసిన మహనీయుడు గిడుగు రామమూర్తి పంతులు అని కొనియాడారు. శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ఆధునిక భాషా శాస్త్రంలో అసదృశ విద్వాంసుడు, దీక్షా పరుడు, నిర్భయుడు, తెలుగు సవరల భాషల అదృష్టదీపకుడు, మహామనిషి గిడుగు రామమూర్తి పంతులు అని కితాబిచ్చారు. గిరిజన ప్రాంతాల్లో పర్యటించి సవర భాష వ్యాప్తికి కృషి చేసి నిఘంటువులను తయారు చేశారన్నారు. ఆయన కృషికి అప్పటి ప్రభుత్వం రావ్ బహదూర్ బిరుదుతో సత్కరించిందని, ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించిందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ డి.వి.సూర్యారావు, డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి, సిహెచ్.చిన సూర్యనారాయణ, కొత్తూరి రమణ, కుప్పిలి భీమేశ్వరరావు, రామతాత, భాగవతుల సత్యనారాయణ మూర్తి, పి.గణేశ్వరరావు, గండికోట సుబ్బలక్ష్మి, పి.వి.ఆర్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొరపాట్లకు తావులేకుండా ఓటరు జాబితా

- జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్
- ఈఆర్‌వో, ఏఈఆర్‌వో, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో సమీక్ష



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

తాటిచెట్లపాలెం: ఓటరు జాబితాలో పొరపాట్లు, క్రమరాహిత్యాలు లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా డూప్లికేట్ ఓట్లను తొలగించే క్రమంలో జాగ్రత్త వహించాలని, ఒకటికి రెండు సార్లు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. పశ్చిమ నియోజకవర్గ పరిధి ఈఆర్‌వో, ఏఈఆర్‌వో, బీఎల్‌వో, సూపర్‌వైజర్లతో అక్కయ్యపాలెం షాదీఖానాలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే డోర్ నంబర్‌లో అధిక ఓట్లు ఉన్నా, ఒకరి పేరు మీద రెండు ఓట్లు ఉన్నా.. బీఎల్‌వోలు స్వయంగా ఆయా ఇళ్లకు వెళ్లి పరిశీలించాలని తెలిపారు. అన్ని వివరాలు సరిపోయిన తరువాతే ఓట్లను తొలగించాలన్నారు. డూప్లికేట్ ఓట్ల తొలగింపులో సంబంధిత ఓటరు నుంచి సమ్మతి తీసుకోవాలని స్పష్టం చేశారు. చిరునామా మారినా.. వలస వెళ్లిపోయినా వారి వివరాలను కచ్చితంగా తెలుసుకోవాలని, అనంతరం చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. బీఎల్‌వోలు ఓటు సవరణలు ఈఆర్‌వో 2.0 ద్వారా ఆన్‌లైన్‌లో తప్పక అప్‌లోడ్ చేయాలన్నారు. ఎన్నికల నియమావళిని పాటిస్తూ, జాబితా రూపకల్పనలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, చిన్న తప్పు కూడా లేకుండా అత్యంత పారదర్శకతతో కూడిన తుది ఓటర్ల జాబితాను ప్రచురించేందుకు అందరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో డీఆర్‌వో కె.మోహన్‌కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ జోనల్ కమిషనర్, తహసీల్దార్లు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు పోటీలు



బహుమతులు పొందిన విద్యార్థినులతో నిర్వాహకులు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థినులకు పోటీలు నిర్వహించారు. విశాఖపట్నం పోర్టు ట్రస్ట్, భారతీయ జీవిత బీమా సంస్థ విశాఖ డివిజన్ సంయుక్త ఆధ్వర్యంలో వ్యాసరచన, ఎలక్యూషన్ పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. సమాజంలో జరుగుతున్న మోసాలపై విద్యార్థినులకు అవగాహన ఉండాలని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం నుంచి జి. జ్యోతి, డాక్టర్ బి. నాగమణి, ఎకనామిక్స్ విభాగం నుంచి డాక్టర్ కేఎల్ శిరీష, ఐక్యూఏసీ కన్వీనర్ డి. అరుణపద్మ, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.